# ముత్యాల ముగ్గులు - రత్నాల ముగ్గులు



# ధనుర్మాసము

**ధనుర్మాసారంభం :** ఈ రోజు సూర్యుడు ధనురాశిలో ప్రవేశించే పుణ్యవేళ. ఈ సంక్రమణ కాలంలో విష్ణుపూజ, దానజపాదులు విశేషఫలప్రదం. ఈరోజునుండే ధనుర్మాసం ప్రారంభం.'మార్గళి' వ్రతం వేళ ఇది. 'తిరుప్పావై' పారాయణ ఈ రోజు నుండి మొదలు. వైష్ణవ సంప్రదాయంలో విశేషించి ఈ మాసానికి ప్రత్యేక ప్రాధాన్యం.

**వైకుంఠ ఏకాదశి :** ధనుర్మాసంలో వచ్చే ఈ ఏకాదశి పవిత్రమైనది. ఈ రోజున ఉపవాసం, విష్ణు ఆరాధన – విశేష ఫలాన్ని ప్రసాదిస్తాయి. విష్ణు ప్రీతికరమైన ఏకాదశులలో ఇది అత్యంత ప్రధానమైనది. వైకుంఠ ద్వారాలు తెరచుకొనే రోజుగా దీనిని భావిస్తాం. సౌరశక్తి ఉత్తరాయణంకి మారే ముందు వచ్చే ఏకాదశి ఇది. దీనిని మహిమాన్వితమైన ఏకాదశిగా పురాణాలు వర్ణించాయి. ఏకాదశి ముందు ఉపవసించాలి. ఆ రోజు షోడశోపచారాలతో నారాయణుని అర్చించాలి. ద్వాదశినాడు తిరిగి పూజించి అన్నాదికాలు నివేదించి పారణ చేయాలి.

**ఏకాదశ్యాం నిరాహారో భూత్వాహమపరేహని ।**
**భోక్ష్యామి పుండరీకాక్ష, శరణం మే భవాచ్యుత ॥**

అని మంత్రముచ్చరించి పుష్పాంజలిని దేవునికి సమర్పించాలి.

ప్రతిశనివారం సంవత్సరంపాటు ఈ క్రింది నామాలను, స్తోత్రాన్ని పఠిస్తే శనిపీడ కలుగదు.

**కోణస్థః పింగలో బభ్రుః కృష్ణో రౌద్రోంతకో యమః**
**శౌరః శనైశ్చరో మందః పిప్పలాదేన సంస్తుతః ॥**

**నమస్తే కోణ సంస్థాయ పింగలాయ నమోస్తుతే ।**
**నమస్తే బభ్రు రూపాయ కృష్ణాయ చ నమోస్తుతే ॥**

**నమస్తే రౌద్రదేహాయ నమస్తే చాంతకాయచ ।**
**నమస్తే యమ సంజ్ఞాయ నమస్తే సౌరయేవిభో ॥**

**నమస్తే మంద సంజ్ఞాయ శనైశ్చర నమోస్తుతే ।**
**ప్రసాదం మమదేవేశ దీనస్య ప్రణతస్యచ ॥**

**సఫల ఏకాదశి :** ధనుర్మాసంలో వచ్చే రెండవ ఏకాదశి, విష్ణుప్రీతికరమైన ఈ రోజున విశేష ఫలప్రదం. రోజు, నారాయణార్చన, విష్ణు సహస్రనామ పారాయణ వంటివి. భోగము కలది భోగి. విష్ణుచిత్తుని కుమార్తె అయిన శ్రీ గోదాదేవి (ఆండాళ్) శ్రీరంగనాథుని వరించి తరించిన భూలక్ష్మి స్వామిని అలంకరించాల్సిన పూలమాలను తాను ధరించి, వాటి సౌందర్యానికి మురిసి–ఆ తరువాత భగవంతునికి అలం

కరించేది, శ్రీమన్నారాయణుని పతిగాకోరి – ధనుర్మాసవ్రతం (మార్గశిరవ్రతం) ఆచరించి, ఆ స్వామి అనుగ్రహాన్ని పొందినది. వ్రత పరిసమాప్తి జరిగి, స్వామిని చేపట్టిన రోజు ఇది. నారాయణునిచేరి, ఆ జగజ్జనని భోగములందిన దినమిది. ఈ రోజున తలంటుస్నానం చేసి భగవదర్చన చేయడం శ్రేయఃప్రదం. చలిమంటలు వేయడం ఈ రోజున ఆచారం.

**భోగి :** హేమంత (ధనుర్మాస) వ్రత ఫలంగా గోదాదేవి రంగనాథుని వివాహమాడిన పుణ్యదినమిది. ఈ రోజున మృష్టాన్నాది ఇష్టభోగాలను స్వీకరించాలని శాస్త్రవచనం.

**మకర సంక్రమణం :** ఇది అత్యంత పుణ్యకాలం. పైగా ఈ ఏడాది 'ముక్కోటి ఏకాదశి' కూడా కలవడంతో మరింత పుణ్యయోగం కలిగింది. స్నాన, దాన, జపాదులు విశేషఫలాన్నిస్తాయి. ఉదయాన్నే స్నానం చేయడం ముఖ్య కర్తవ్యం.

**రవి సంక్రమణే ప్రాప్తే నస్నాయా ద్యస్తు మానవః ।**
**సప్త జన్మ సురోగీస్యాత్ నిర్ధనశ్చైవ జాయతే ॥**

సంక్రాన్తి నాడు స్నానం చేయనివానికి రోగాదులు వస్తాయనీ ధర్మశాస్త్ర వచనం.

**సంక్రాన్తేయానిదత్తాని హవ్యకవ్యాని దాతృభిః ।**
**తాని నిత్యం దదాత్యర్కః పునర్జన్మని జన్మని ॥**

"సంక్రాన్తినాడు దేవతలకు, పితృదేవతలకు, పాత్రులకు ఏఏ పదార్థాలను దానంచేస్తామో అవి అత్యధికంగా జన్మజన్మలకీ లభిస్తాయి. ఉత్తరాయణ పుణ్యకాలానికి ఆరంభమిది. ఈ పుణ్యకాలంలో తిలలు, బియ్యం కలిపి శివుని పూజించుట, నువ్వుల నూనెతో దీపం వెలిగించుట చాలా శ్రేష్ఠం. నల్లనువ్వులతో పితృతర్పణం చేయాలి. శివునకు ఆవునేతితో అభిషేకం శ్రేష్ఠం. సంక్రాన్తి తదుపరి వచ్చే పర్వదినాలు పశుపూజకి వినియోగిస్తారు. శ్రమకీ, సంపదకీ ఆరాధ్యస్థాన మిచ్చిన పండుగలివి.ట

**మకరసంక్రాంతి :** సూర్యభగవానుడు మకరరాశిలో ప్రవేశించే పుణ్యఘడియ, ఉత్తరాయణ పుణ్యకాల ఆరంభం, దేవమార్గం ప్రారంభమయ్యేరోజు, ఈ సంక్రాంతి వేళ స్నాన, దాన, జప, వ్రతాదులు విశేషఫలం, గుమ్మడి వస్త్రములుదానంచేయడం ఆచారం. పంట చేతికందిన ఈ పర్వం నాడు ప్రతి ఇంటా శోభ వెల్లివిరుస్తుంది. విష్ణు సహస్రనామ పఠనం ఈరోజున విశేషమైన శుభఫలాలనిస్తుంది. దేవ, పితృ దేవతలనుద్దేశించి చేసే తర్పణాదుల్ను, దానాదులు పుణ్యప్రదం, పౌష్యలక్ష్మిగా జగదంబను ఆరాధించే కాలమిది.

**కనుమ :** పాడి పంటలను పూజించే రోజు, పశుసంపదను లక్ష్మీ స్వరూపంగా భావించి అర్చించడం ఈ రోజున విశేషం. ప్రకృతిలో తన్మయమయ్యే పండుగలివి.



## పుష్యమాసం

**త్యాగరాజ ఆరాధన :** మహాభక్తుడు, సంగీత సాహిత్య సమ్రాట్, మహావాగ్గేయ కారుడు రామానుగ్రహసిద్ధుడు నాదబ్రహ్మ శ్రీ త్యాగరాజస్వామివారు పరమపదించిన పుష్య బహుళ పంచమి ఈదినం. సన్యాసాశ్రమ స్వీకారంచేసి, కైవల్యం పొందిన కారణంగా వారి తిథిని 'ఆరాధన'గా చేస్తారు. వారు సమాధిగా పొందిన 'తిరువారూరు' క్షేత్రంలో ప్రసిద్ధ వర్ధమాన సంగీతకారులు విచ్చేసి స్వామివారి 'ఘనరాగ పంచరత్న కీర్తనలు' మొదలైనవి ఆలపిస్తారు. త్యాగరాజస్వామిని ఆరాధిస్తారు. తెలుగువారేకాక, సంగీత సాహిత్య ప్రియులు, భారతీయ సంస్కృతి ప్రీతి కలవారంతా ఆరాధించవలసిన పుణ్యమూర్తి శ్రీత్యాగరాజులవారు.

**వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి :** ఈ రోజున ఉపవాసము, విష్ణుపూజ విశేష ఫలప్రదం. వైకుంఠ ద్వారాలు తెరచుకొనే రోజుగా దీనిని భావిస్తాం. సౌరశక్తి ఉత్తరాయణంకి మారే ముందు వచ్చే ఏకాదశి ఇది. మహిమాన్వితమైన ఏకాదశిగా దీని గురించి పురాణాలు వర్ణించాయి. ఏకాదశి ముందు రోజు ఏకభుక్తము (ఒంటిపూట భోజనం) చేసి, ఏకాదశినాడు శక్తి కొలది ఉపవసించాలి. ఆ రోజున షోడశోపచారాలతో నారాయణుని అర్చించాలి. ద్వాదశినాడు తిరిగి పూజించి అన్నాదికాలు నివేదించి, పారాయణచేయాలి.

**ఏకాదశ్యాం నిరహారో భూత్వాహ మవరేహని ।**
**భోక్ష్యామి పుండరీకాక్ష ! శరణం మేభవాచ్యుత ॥**

అని మంత్రముచ్చరించి పుష్పాంజలిని దేవునికి సమర్పించాలి.

# మాఘమాసం

**మాఘమాసం ప్రారంభం :** మాఘమాసం స్నానానికి ప్రసిద్ధి. మాఘస్నానం ఇహపరశుభదాయకం.

**మాఘమాసే రటంత్యాపః కించి దభ్యుదితే రవౌ ।**
**బ్రహ్మఘ్నం వా సురాపం వా కంపతంతం పునీమహే ॥**

సూర్యోదయం కాబోతున్న సమయంలో మాఘమాసంలో స్నానంచేస్తే మహా పాతకాలుపోతాయి.

**బ్రహ్మచారీ గృహస్థోవా వానప్రస్థోధభిక్షుకః ।**

నాలుగు ఆశ్రమాలవారు ఎల్లరూ ఈ స్నానం చేయవచ్చు.

**తప్తేన వారిణా స్నానం యద్గృహే క్రియతే నరైః**
**షడబ్దం ఫలదం తద్ధి మకరస్థే దివాకరే**

సూర్యుడు మకరంలో ఉండే సమయంలో (మాఘమాసంలో) సూర్యోదయానికి మునుపు, వేడినీటిలోనైనా ఇంట్లో స్నానం చేసినా ఆరు సంవత్సరాల అఘఘర్షణ స్నానఫలం లభిస్తుంది. బావినీటి స్నానం పన్నెండేళ్ల పుణ్యస్నాన ఫలాన్నీ, తటాకస్నానం ద్విగుణం, నదీస్నానం చాతుర్గుణం, మహానదీ శతగుణం, మహానదీ సంగమ స్నానం దానికి చతుర్గుణం, గంగాస్నానం సహస్రగుణం, గంగా యమునా సంగమ (త్రివేణీ సంగమ) స్నానం నదీ శతగుణ ఫలాన్ని ఇస్తాయి. అందుకే ఈ సమయాన అలహాబాద్ (త్రివేణీ సంగమం) లో కుంభమేళా జరుగుతుంది. మాఘంలో ఇంట్లో స్నానం చేసేటప్పుడు గంగాయమునాది దివ్య తీర్థాలను స్మరించి స్నానం చేయాలి.

**"దుఃఖ దారిద్ర్య నాశాయ శ్రీ విష్ణోస్తోషణాయ చ ।**
**ప్రాతః స్నానం కరోమ్యద్య మాఘే పాపవినాశనం ॥**
**మకరస్థే రవౌ మాఘే గోవిందాచ్యుత మాధవ ।**
**స్నానేనానేనమే దేవ యథోక్త ఫలదోభవ" ॥**

అనే ఈ శ్లోకాన్నిచదివి స్నానంచేయాలి. ఇలా రోజూ కుదరనప్పుడు (ఆరోగ్యం అనుకూలించనప్పుడు, మాఘ, పాడ్యమి, విదియ, తదియ తిథులలో స్నానం చేసి, మళ్లీత్రయోదశి, చతుర్దశి మాఘపూర్ణిమ తిథులలో స్నానం చేయవచ్చు.

మాఘమాసపు ఆదివారాలలో నియమబద్ధంగా సూర్యునకు క్షీరాన్నంవండి నివేదించితే రోగ, దారిద్ర్యాలు పోతాయి. ఆ రోజున తరిగిన కూరలు తినకూడదు. తైలాన్ని రాసుకోవడం, మాంసం, ఉల్లి, వెల్లుల్లి తినడం పనికిరాదు. మాఘమాసంలో ముల్లంగిని తినరాదని ధర్మశాస్త్రం.